క్లుప్తంగా

వెండి వస్తువులు అందజేత



చిట్టేల(వత్సవాయి): గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి జగ్గయ్యపేటకు చెందిన గోపాల కృష్ణ, స్వరూప దంపతులు ఆలయానికి వెండి వస్తువులను అందజేశారు. సోమవారం ఆలయంలో జరిగిన కార్యక్రమంలో స్వామివారి నిత్య కైంకర్యాల కోసం రూ.60 వేల విలువచేసే వెండి పంచ పాత్రలను ఆలయ పూజారి సిరికొండ సాయికృష్ణమాచార్యులకు ఇచ్చారు. ఈ సందర్భంగా దాతకు శాలువా కప్పి సత్కరించి, స్వామివారి ప్రసాదాలను అందించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



పెనుగంచిప్రోలు: మహిళా దినోత్సవం పురస్కరించుకుని స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్లో పోలీసుశాఖ ఆధ్వర్యాన సోమవారం విద్యార్థినులకు లింగ సమానత్వం సాధించడానికి పురుషుల పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ మహిళలకు ఇంకా పూర్తిగా స్వేచ్ఛ రాలేదని, సాధికారత కూడా ఇంకా రావాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం వేగినేటి రమణ, ఏఎస్ఐ నాగేశ్వర రావు, ఉపాధ్యాయులు ముక్కా సత్యనారాయణ, సుమలత, నిరంజన్, దానయ్య, రాము, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలోని శ్రీతిరుపతమ్మ ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి సోమవారం గ్రామస్తుడు కొలిపాక వెంకటేశ్వర్లు, తులసమ్మ దంపతులు రూ.20,116 ఆలయ ఈవో కిషోర్‌కుమార్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ అధికారులు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలను ఇచ్చారు.

నీరుకొండ సేవలు ఎనలేనివి

నందిగామ టౌన్(నందిగామ రూరల్): నీరుకొండ నరసింహారావు ఉపాధ్యాయుడిగానే కాకుండా పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన సేవలు ఎనలేనివని మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి కొనియాడారు. పట్టణంలోని సాయిదుర్గా రెసిడెన్సీలో సోమవారం ఆయన సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీరుకొండ వామపక్ష భావజాలంతో నమ్మిన సిద్ధాంతానికి చివరి వరకు కృషి చేశారన్నారు. ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఆయన జీవనం సాగిందన్నారు. కార్యక్రమంలో వాసిరెడ్డి ప్రసాద్, నీలకంఠం, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

వీరులపాడు: వాహనచోదకులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ అనిల్ పేర్కొన్నారు. మండలంలోని పొన్నవరం గ్రామ శివారులో సోమవారం ఆయన రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. లైసెన్స్‌తో పాటు వాహన పత్రాలను వెంట ఉంచుకోవాలని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈనెల 5న విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగే 'చలో విజయవాడ' కార్యక్రమం విజయవంతం చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.మహేష్ కోరారు. కొండపల్లి మున్సిపాలిటీ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో సమ్మె కాలపు హామీల అమలు, కార్మికుల క్రమబద్ధీకరణ, ఇంజినీరింగ్ కార్మికుల వేతనాల పెంపు వంటి సమస్యల పరిష్కారం కోసం ప్రతి ఒక్కరూ హాజరు కావాలన్నారు. మున్సిపాలిటీ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో పదికి సిద్ధం

- 'జగ్గయ్యపేట'లో ప్రత్యేక తరగతులపై ఉపాధ్యాయుల దృష్టి
- నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం
- 2,720 మంది విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం



కన్నెవీడు జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

వత్సవాయి: విద్యార్థులు ప్రణాళికతో చదివి పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్నారు. మరో పది రోజుల్లో టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. విద్యార్థి జీవితంలో పదోతరగతి ఎంతో కీలకమైంది. భవిష్యత్తులో ఉన్నత చదువులకు మొదటి మెట్టులాంటి టెన్త్ పరీక్షలను విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. మార్చి 17 నుంచి పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఈ క్రమంలో ఉత్తమ ఫలితాల సాధనే ధ్యేయంగా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. పరీక్షలు ఎలా రాయలో వారికి సూచిస్తున్నారు.

తరగతిలో వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారికి నిపుణులైన ఉపాధ్యాయులతో మెళకువలను నేర్పిస్తున్నారు. పాఠశాల స్థాయిలో నిర్వహించిన పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను కేటగిరీల వారీగా విభజిస్తూ తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి 6 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పరీక్ష సమయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో, మానసికంగా ఎలా సిద్ధపడాలో చెబుతున్నారు. సులభపద్ధతిలో జవాబులు రాయడానికి వీలుగా విద్యార్థులు చదివిన వెంటనే పేపర్‌పై సంబంధిత జవాబులను రాయిస్తున్నారు. చదివింది విద్యార్థులకు గుర్తుండేలా యోగా కూడా చేయిస్తున్నారు.

'పేట'లో 2,720 మంది విద్యార్థులు

నియోజకవర్గంలోని వత్సవాయి, పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు 57 ఉన్నాయి. ఆయా పాఠశాలలకు చెందిన 2,720 మంది టెన్త్ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. వత్సవాయి మండలంలో 512 మంది విద్యార్థులు, జగ్గయ్యపేట మండలంలో 1737 మంది, పెనుగంచిప్రోలు మండలంలో 471 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయనున్నారు. వీరిలో బాలికలు 1,442, బాలురు 1278 మంది ఉన్నారు. ఈ పాఠశాలలన్నింటిలో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేస్తున్నారు.

ప్రత్యేక తరగతులతో ఉపయోగం



ప్రత్యేక తరగతులు ఎంతగానో ఉపకరిస్తున్నాయి. ఉపాధ్యాయులు చెప్పిన వాటిని నెమరవేసుకుని జవాబులను చూడకుండా పేపర్‌పై రాసుకుంటున్నాం. మంచి మార్కులు సాధించడానికి ప్రత్యేక తరగతులు ఉపయోగపడతాయి. పరీక్ష సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉపాధ్యాయులు వివరిస్తున్నారు.

– ఎస్‌కే జాన్‌సైదా, పదో తరగతి

నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ముందుకుసాగుతున్నాం. సబ్జెక్టులలో వెనకపడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేకంగా ఉపాధ్యాయులను కేటాయిస్తున్నాం. ప్రత్యేక తరగతులు విద్యార్థులకు రివిజన్‌లా ఉపయోగపడుతున్నాయి.

– ఆర్.అశోక్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు, వత్సవాయి

గతేడాది 10 పరీక్ష సెంటర్లు

మూడు మండలాల్లో గతేడాది మొత్తం 10 సెంటర్లు ఏర్పాటుచేశారు. వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల్లో కలిపి రెండే సెంటర్లు ఏర్పాటుచేయగా, జగ్గయ్యపేట మండలంలో 6 సెంటర్లను ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఇంకా సెంటర్లను ఎంపిక చేయలేదు.

మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలి



కంచికచర్ల : మహిళలు అన్ని రంగాల్లో సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ కరీమాబీ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని గండేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం మొక్కలు నాటి సంతకాల సేకరణ, క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లులు తమ పిల్లలను చదివించాలన్నారు. బాలికలు అని వివక్ష చూపకుండా మగ పిల్లలకు దీటుగా అన్ని రంగాల్లో రాణించేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో లీగల్ ప్రొహిబిషన్ అధికారి కిరణ్‌కుమార్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థికశాస్త్రంపై అవగాహన పెంచుకోవాలి

మైలవరం: విద్యార్థులు ఆర్థిక శాస్త్రంపై అవగాహన పెంచుకోవాలని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు నారాయణరావు తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం వైస్ ప్రిన్సిపాల్ రంగారావు అధ్యక్షతన ఆర్థిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ షేక్ కరీముల్లా అతిథి ఉపన్యాసం చేశారు.

బాల్య వివాహాలను అరికట్టండి



కొణకంచిలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యాధికారి వాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు



పేట బాలికల హైస్కూల్ వద్ద..

కొణకంచి(పెనుగంచిప్రోలు): బాల్య వివాహాలను అరికట్టాలని స్థానిక ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారి కె.వాణి అన్నారు. బాల్య వివాహ రహిత ఏపీ కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యాన సోమవారం ప్రతిజ్ఞ చేయడంతో పాటు ర్యాలీ, సంతకాల సేకరణ, మానవహారం నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండకుండా బాల్యవివాహాలు చేయకూడదని, లైంగిక వేధింపులపై, చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోనెల దేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నందిగామ రూరల్: బాల్య వివాహాలతో కలిగే దుష్ఫలితాలపై ప్రజలకు అవగాహన కలిగించాలని ఏసీడీపీవో కృష్ణకుమారి పేర్కొన్నారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్‌లతో కలిసి బాల్య వివాహాలపై అవగాహన ర్యాలీ చేశారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిధిలోని బాల్య వివాహాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. ప్రతిజ్ఞ చేయించి మొక్కలు నాటారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బందితో కలిసి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వెంకటరావమ్మ, కరుణకుమారి, తారాబి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట అర్బన్: బాల్య వివాహాలు చేయొద్దని సీడీపీవో లక్ష్మీభార్గవి అన్నారు. ఈ నెల 3 నుంచి 8 వ తేదీ వరకు జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా సోమవారం పట్టణంలో జెడ్పీ బాలికల హైస్కూల్‌లో ఐసీడీఎస్ ప్రాజెక్టు చిల్లకల్లు ఆధ్వర్యంలో బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీవో లక్ష్మీభార్గవి మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టప్రకారం నేరమని తెలిపారు. అనంతరం బాల్యవివాహ రహిత ఏపీకి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం లక్ష్మీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రజనీజ్వాల, శారద, బీబీజాన్, అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలికలు తదితరులు పాల్గొన్నారు.

చెరువు నీటిని విడుదల చేయండి

నందిగామ టౌన్(నందిగామరూరల్): పెనుగంచిప్రోలు మండలం నవాబుపేటలో చెరువు నీటిని విడుదల చేసి వరి పంటను కాపాడాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. వరి పంట ఎండు దశకు చేరిందని తక్షణమే నీటిని విడుదల చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ అనాసాగరం, తోటచర్ల, మునగచర్ల గ్రామాల్లో సాగు చేసిన సుమారు 100 ఎకరాల్లో వరి పంట ఎండు దశకు చేరిందన్నారు. గత ఆగస్టులో వచ్చిన వరదలు, వర్షాల కారణంగా వరి పంట పూర్తిగా కొట్టుకుపోవడంతో రబీలో వరి సాగు చేశామని తెలిపారు. పెనుగంచిప్రోలు మండలం నవాబుపేటలో చెరువు నుంచి వచ్చే వాగు నీటితోనే ఈ ప్రాంతంలోని పంట పొలాలు సాగవుతున్నాయన్నారు. చెరువు నిర్వాహకులు నీటిని విడుదల చేయకపోవడంతో వరి పంట బీట వారి దర్శనమిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పెనుగంచిప్రోలు చెరువు నీటిని విడుదల చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు సీహెచ్ కృష్ణ, ఆవుల రామనరసింహం, పలువురు రైతులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): కళాశాల స్థాయిలో ప్రతి విద్యార్థి వ్యక్తిత్వ వికాసం కలిగి ఉండాలని ఆర్కే ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కంద్రగుంట రామకృష్ణయ్య తెలిపారు. కేతనకొండ ఆర్కే కళాశాలలో ఏఐఎంఎల్, డీఎస్ విభాగాల ఆధ్వర్యంలో కెరీర్ కౌన్సెలింగ్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు.

'ద్వితీయ' ఇంటర్ పరీక్షలు ప్రారంభం



కీసర బీజేటీ డిగ్రీ కళాశాలలో హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ దుగ్గిరాల ప్రకాష్

కంచికచర్ల : ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కంచికచర్ల మండల పరిధిలో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారని కస్టోడియన్ అధికారి వాసుదేవరావు తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు పరీక్ష ప్రారంభమైంది. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు కట్టుదిట్టంగా జరిగాయి. 779మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 727మంది వచ్చారని 52మంది గైర్హాజరయ్యారని కస్టోడియన్ అధికారి తెలిపారు. కంచికచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 172 మందికి 155మంది హాజరుకాగా 17మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఇమ్మాక్యులేటివ్ డిగ్రీ కళాశాలలో 172మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 157మంది హాజరవ్వగా 15 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. అక్షర డిగ్రీ కళాశాలలో 226కి 213మంది పరీక్షరాయగా 13మంది గైర్హాజరయ్యారని తెలిపారు. మండలంలోని కీసర బీజేటీ డిగ్రీ కళాశాలలో 209మందికి 202మంది పరీక్ష రాయగా ఏడుగురు గైర్హాజరయ్యారని వాసుదేవ రావు పేర్కొన్నారు.

'ఇంటర్ ఓపెన్' సెంటర్లు తెలియక ఇబ్బందులు

జగ్గయ్యపేట అర్బన్: ఇతర ప్రాంతాల నుంచి ఇంటర్ ఓపెన్ పరీక్షలు రాయడానికి జగ్గయ్యపేటకు వచ్చిన విద్యార్థులు సెంటర్ల చిరునామా తెలియక ఇబ్బంది పడ్డారు. మంగళవారం నుంచి మార్చి 15వ తేదీ వరకు జరగనున్న పరీక్షలకు సెంటర్లుగా ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, తపోవన్, చేగు విద్యాలయం, శ్రీచైతన్య ప్రైవేటు పాఠశాలలను కేటాయించారు. వీటన్నింటికీ కలిపి 674 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 108 మంది గైర్హాజరయ్యారు. ఒంగోలు, గుంటూరు, మంగళగిరి, ఏలూరు, గన్నవరం, కంకిపాడు, విజయవాడ, తిరువూరు వంటి సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడ సెంటర్‌కు విద్యార్థులను కేటాయించడంలో ప్రభుత్వ అంతర్యమేంటని విద్యార్థులు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెంటర్లు ఎక్కడ ఉన్నాయో తెలియక ఇబ్బందులు పడ్డామని చెబుతున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఎ.శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ అంతా ప్రశాంతంగా పరీక్షలు జరుగుతున్నాయని, చైతన్య స్కూల్లో మాత్రం ఇరుకుగదులు ఉన్నాయని తెలిపారు.

హెల్మెట్ తప్పనిసరి



కీసర హైవే పక్కన నో హెల్మెట్.. నో ఎంట్రీ ఫ్లెక్సీని ఏర్పాటు చేస్తున్న సీఐ చవాన్‌దేవ్, ఎస్ఐ రాజు

కంచికచర్ల: ద్విచక్ర వాహనచోదకులు ప్రతి ఒక్కరూ శిరస్త్రాణం ధరించాలని నందిగామ రూరల్ సర్కిల్ సీఐ చవాన్ దేవ్ అన్నారు. కీసర సమీపంలో జాతీయ రహదారి పక్కన నో హెల్మెట్ నో ఎంట్రీ అనే ఫ్లెక్సీని సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, హెల్మెట్ ధరిస్తే రోడ్డు ప్రమాదాలు జరిగే సమయంలో సురక్షితంగా బయట పడవచ్చన్నారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా తలకు తీవ్రగాయాలై ప్రాణాలు కోల్పోతున్నారని అందుకే హెల్మెట్ ధరించాలన్నారు. వాహన పత్రాలు అందుబాటులో ఉండాలని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదన్నారు. రాంగ్ రూట్‌లో వాహనాలు నడపరాదని, మితిమీరిన వేగంగా వాహనాలను పోనీయొద్దన్నారు. ట్రిపుల్ రైడ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దన్నారు. వాహనం నడిపే సమయంలో మీ కుటుంబ సభ్యులు, పిల్లలను గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని చిల్లకల్లు రోడ్డులో మంగళవారం వైఎస్సార్ సర్కిల్ సీఎస్ఐ కృష్ణా–గోదావరి డయోసిస్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నూతన సీఎస్ఐ మిషన్ హాస్పిటల్ ప్రారంభోత్సవం సందర్భంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం జరుగుతుందని సీఎస్ఐ డయోసిస్ సభ్యులు పాకలపాటి కనకరాజు, ఎంపీపీ జోసఫ్ సోమవారం తెలిపారు. పలు రకాల వ్యాధులకు వైద్య నిపుణులు ఉచితంగా పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేస్తారని తెలిపారు.

- ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 8 వ తేదీన ఉక్కు కళావేదికలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విమలాభాను ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం జరగనుంది.

మరమ్మతులు చేయించండి మహాప్రభో..



మున్సిపల్ ఉక్కు కళావేదిక ప్రాంగణంలో నిరుపయోగంగా ఉన్న బ్యాటరీ ఆటోలు



పాత మున్సిపల్ ఆఫీసులో మరమ్మతులకు గురైన చెత్త సేకరణ రిక్షాలు

జగ్గయ్యపేట: పట్టణంలోని మున్సిపాలిటీలో 31 వార్డుల్లో చెత్త సేకరణకు ఉపయోగించే వాహనాలు, రిక్షాలు మరమ్మతులకు నోచుకోవడంలేదు. కొంత కాలంగా పాత మున్సిపల్ కార్యాలయం సమీపంలోని మున్సిపల్ ఉక్కు కళావేదికలో చెత్త సేకరించే బ్యాటరీ ఆటోలు, రిక్షాలు పనిచేయక నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఏటా మున్సిపాలిటీకి రూ. కోట్లాది ఆదాయం వస్తున్నా వాహనాలు మరమ్మతులకు నోచుకోక లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగమవుతోంది. మొత్తం 31 వార్డుల్లో 46 చెత్త సేకరణ రిక్షాలు ఉండగా 35 పని చేస్తుండగా 11 పని చేయడంలేదు. బ్యాటరీ ఆటోలు ఆరు ఉండగా ఇందులో 2 ఆటోలు మాత్రమే చెత్త సేకరిస్తుండగా మిగిలిన 4 మరమ్మతులకు గురయ్యాయి. చెత్త డంపింగ్ యార్డు వద్ద కొన్ని రోజులుగా మినీ జేసీబీ మరమ్మతుల కారణంగా పని చేయడంలేదు. ఈ వాహనాలకు మరమ్మతులు జరగక వార్డుల్లో చెత్త సేకరణకు వచ్చే పారిశుద్ధ్య కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని వార్డుల్లో అయితే ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో చెత్త సేకరిస్తున్నారు. అధికారులు స్పందించి వాహనాల మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గాలికుంటు టీకాలు తప్పనిసరిగా వేయించాలి

జిల్లా పశు వైద్యాధికారి హనుమంతురావు



కొత్తూరులో టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా పశు వైద్యాధికారి హనుమంతురావు

జి.కొండూరు: రైతులు పశువులకు గాలికుంటు టీకాలను తప్పక వేయించాలని ఎన్టీఆర్ జిల్లా పశు వైద్యాధికారి ఎం.హనుమంతురావు అన్నారు. జి.కొండూరు శివారు కొత్తూరు గ్రామంలో సోమవారం నిర్వహించిన గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. గాలికుంటు వ్యాధి వల్ల పశువులు జ్వరం బారిన పడి నీరసించి పాల ఉత్పత్తి పడిపోయి ఆర్థికంగా నష్టపోతారన్నారు. గాలికుంటు టీకాలను ముందస్తుగా వేయించడంతో వ్యాధి నిరోధక శక్తి పెరిగి పశువులు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. టీకాలు వేయిస్తే ఈ వ్యాధి బారిన పడి దూడలు మరణించకుండా కాపాడుకోవచ్చన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు టీకాలను వైద్యాధికారులు ఇంటి వద్దకే వచ్చి వేస్తారని వివరించారు. రైతులు ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి ఎస్.శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జన్ ఔషధి దివస్ వారోత్సవాలు



జన్ ఔషధి దివస్‌లో చిన్నారులు

మధురానగర్ (విజయవాడ సెంట్రల్): జన్ ఔషధి దివస్ వారోత్సవాల్లో భాగంగా సోమవారం నగరంలోని పలు పాఠశాలలకు చెందిన చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా సహకార అధికారి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జన్ ఔషధి ప్రయోజనాలను తెలియజేశారు. రాబోయే తరాలకు జన్ ఔషధి సందేశాన్ని వ్యాప్తి చేయడానికి పీఎం నరేంద్రమోదీ చొరవతో పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 15వేల కంటే ఎక్కువ జన్ ఔషధి కేంద్రాలు ప్రారంభమయ్యాయని, 2027 మార్చి31 నాటికి దేశవ్యాప్తంగా 25వేల జన్ ఔషధి కేంద్రాలను ప్రారంభించాలని ప్రభుత్వ లక్ష్యంగా పని చేస్తోందని తెలిపారు. జనరిక్ ఔషధాలను ప్రోత్సహించటానికి, ఏటా మార్చి 7వ తేదీన జన్ ఔషధి దివస్‌గా జరుపుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్ కో ఆపరేటివ్ సహకార అధికారి కిరణ్‌కుమార్, నోడల్ ఆఫీసర్ అల్లు హరికృష్ణ, ప్రసాద రావు, ఆర్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మక ఆలోచనలకు సైన్స్‌ఫెయిర్ దోహదం

ఇబ్రహీంపట్నం: సైన్స్ ఫెయిర్ ప్రదర్శనలు, ఆవిష్కరణలు విద్యార్థుల్లో సృజనాత్మకత ఆలోచనలకు దోహద పడతాయని ఇండియన్ ఫిలింఫెస్టివల్ పౌండర్ లక్కరాజు వంశీ తెలిపారు. స్థానిక సెవెంత్ డే అడ్వంటిస్ట్ పాఠశాలలో సైన్స్ ఫెయిర్– 2025 సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్‌కేజీ నుంచి విద్యార్థులను సైన్స్ ఫెయిర్‌లో భాగస్వామ్యం చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు వివిధ ఆవిష్కరణలను ప్రదర్శించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. జోన్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డేనియల్ కుమార్, జి.మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ డెవిడ్ మార్క్, ప్రవాస భారతీయుడు ప్రసన్న కుమార్ స్కూల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.